క్లుప్తంగా

రైతులకు బాసటగా నిలుద్దాం

– అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్రంలోని రైతులకు బాసటగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. ఆయన ఆదివారం పార్లపల్లిలో రైతులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. స్టేట్ ఎస్సీ కార్యదర్శి ఉగ్గుమూడి గుర్నాథం, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, సముద్రాల అశోక్, వెంకటేశ్వర్లు, నాగూర్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



మోహన్‌శెట్టి

నాగలాపురం: బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన బైటకొడియంబేడు పుత్తూరు–చెన్నై హైవేపై రోడ్డులో చోటుచేసుకుంది. నాగలాపురం బజారు వీధికి చెందిన మోహన్‌శెట్టి(57). ఇతను ఆదివారం సాయంత్రం తన సొంత పనుల నిమిత్తం నాగలాపురం నుంచి బైక్‌లో ఊత్తుకోటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో బైటకొడియం బేడు సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెరుకు రసం దుకాణాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో కంటికి తీవ్రగాయం కావడంతో అతన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



విజేత విద్యార్థులతో అతిథులు

రేణిగుంట: నేషనల్ స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా రేణిగుంట ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ అన్బుకుమార్ కరాటే వారియర్స్ విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు, ఇందులో 20 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వారికి రేణిగుంట సర్పంచ్ నగేషం, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జూలియన్ రాజు, విద్యా వికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ, ఫిజియోథెరపీ డాక్టర్ గౌరేంద్రబాబుల చేతుల మీదుగా సర్టిఫికెట్స్, బెల్ట్స్ అందజేశారు.

మహిళ అదృశ్యం

తొట్టంబేడు: తొట్టంబేడు మండలం పొయ్య గ్రామానికి చెందిన గంధం ఆదిలక్ష్మి(42) అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు ఆదిలక్ష్మి తొట్టంబేడు మండల కార్యాలయంలో తలారిగా పనిచేస్తోంది. శనివారం కుటుంబ సభ్యుల మధ్య గొడవతో మనస్తాపం చెందిన ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


విద్యార్థులకు ప్లేట్ల వితరణ



విద్యార్థులకు ప్లేట్లు ఇస్తున్న టీచర్లు

రేణిగుంట: అత్తూరు ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర టీచర్‌గా పనిచేస్తున్న సుధారాణి టీచర్ డే సందర్భంగా విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. టీచర్లు సోమశేఖర్‌రాజు, బలరామయ్య, భారతి, నవీన్‌కుమార్, జితేంద్ర పాల్గొన్నారు.

అన్నదానం



రేణిగుంట: మాజీ ఎంపీటీసీ సభ్యుడు, సీనియర్ నేత వీఎస్ శంకర్ 75వ జయంతి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆయన అభిమానులు పేదలకు అన్నదానం చేశారు. రేణిగుంట మాజీ ఉప సర్పంచ్‌లు జీకే మునీర్, సూరిబాబు, నరేష్ రాయల్, రాజారాయల్, రమణ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు చంద్ర గ్రహణం

దేశంలో ఎక్కడా లేని విధంగా గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యసురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు వైద్యసేవలు అందించి సత్ఫలితాలను ఇచ్చింది. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలోని 90 సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా 34,109 మంది అప్పట్లో వైద్యం పొందారు. 33,178 మంది మందులు అందుకున్నారు. 1,757 మంది చిన్నపిల్లలకు కంటి పరీక్షలు, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. అలాగే క్యాంపుల్లో 4,078 మందికి కంటి పరీక్షలు చేసి 1,560 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. ఇంతటి గొప్ప పథకాన్ని నేడు కూటమి ప్రభుత్వం నీరుగార్చింది. ఆ పథకాన్ని పేద ప్రజలకు దూరం చేసింది.





సంతవేలూరు ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు (ఫైల్), వరదయ్యపాళెం మండలంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ (ఫైల్)

- ప్రజల చెంతకు దూరమైన ఆరోగ్య సేవలు
- ఆందోళన చెందుతున్న పేద ప్రజలు

వరదయ్యపాళెం: పేద ప్రజల ఆరోగ్యం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష పథకానికి చంద్ర గ్రహణం పట్టుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ పథకాన్ని ప్రజలకు దూరం చేశారు. దీంతో ఆరోగ్య సేవల కోసం మరలా యథా పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు లేక ప్రైవేటు వైద్యానికి వెళ్లాల్సిన పరిస్థితి పునరావృతమైంది. అంతేకాక ఆరోగ్య సురక్ష ద్వారా వివిధ జబ్బులకు సంబంధించి నెలరోజులకు సరిపడా మందులను క్యాంపుల్లో ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో మందుల కోసం వయసు పైపడిన వృద్ధులు, పేద ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అయితే ఈ సమస్యను ఏపీ తమకు పట్టనట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

గత ప్రభుత్వంలో సత్ఫలితాలిచ్చిన ఆరోగ్య సురక్ష

సత్యవేడు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో నిర్వహించిన ఆరోగ్యసురక్ష కార్యక్రమం విజయవంతమైంది. ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లారు. ఇంటి వద్ద లేకపోతే పొలం గట్లకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేపట్టిన పరిస్థితులు అనేకం. జల్లెడ పట్టి రోగులను గుర్తించి ప్రతిఒక్కరికీ వైద్యసేవలు అందించారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతిఒక్కరికీ నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులను అందజేశారు. మెరుగైన వైద్యం కోసం మరికొందరిని జిల్లా ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఆ దశగా సత్యవేడు నియోజకవర్గంలోని 90 సచివాలయాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా అప్పట్లో 34,109 మంది వైద్యం పొందారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, దగ్గు, తలనొప్పి, ఇతరత్రా జబ్బులకు పరీక్షలు చేయించుకుని 33,178 మంది ఉచితంగా మందులు అందుకున్నారు.



ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ (ఫైల్)

బీపీ, షుగర్ బయట పడింది



గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నాకు ఎంతగానో ఉపయోగపడింది. వైద్యులు వివిధ రకాల రక్త, మూత్ర పరీక్షలు చేసి బీపీ, షుగర్ ఉందని నిర్ధారించారు. వెంటనే ఆ రెండు జబ్బులకు ఉచితంగా మందులను అందజేశారు. పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలి.

–డి.నాగమ్మ, సంతవేలూరు, వరదయ్యపాళెం మండలం

ఆరోగ్య సురక్ష కొనసాగించాలి



పేద ప్రజలకు గ్రామస్థాయిలో వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలి. పేద ప్రజల ఆరోగ్య ఇబ్బందులకు ఎంతగానో ఉపయోగపడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు.

–రమణయ్య, వరదయ్యపాళెం

గుడిమల్లం ఆలయంలో జడ్జి



ప్రసాదాలు తీసుకుంటున్న జడ్జి గాయత్రిదేవి

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిన అతి పురాతన శివాలయం పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం విశాఖ జిల్లా అదనపు జడ్జి జస్టిస్ సీకే గాయత్రిదేవి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జల్లిపాపయ్య సేవలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి



జల్లిపాపయ్య ఆలయంలో పూజ చేస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: నెలబల్లి గ్రామంలోని జల్లిపాపయ్యను ఆదివారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం అర్చకులు ఆయన్ను ఆశీర్వదించారు.

అన్నదాత పోరును విజయవంతం చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: అన్నదాత పోరును విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 9న పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు రైతులతో కలిసి అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా, ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, ఎరువులు పక్కదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి, ఉచిత పంటల బీమా పునరుద్ధరించాలని తెలిపారు. చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉత్తరాజి శరవణ, ముత్తు, సిరాజ్, శ్రీవారి సురేష్, కంట ఉదయ్, ఫజల్, మధురెడ్డి, పులి రామచంద్ర, ఆర్కేడ్ శంకర్, చుక్కల కిరణ్, పెరుమాళ్ చౌదరి, బావాజి, మున్నారాయల్, నారాయణ, జయకృష్ణారెడ్డి, రవి పాల్గొన్నారు.

పోరాటం ఉధృతం చేయాలి

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు వేలూరు రాకేష్



వరదయ్యపాళెం: రాష్ట్రంలోని రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్య చాలా ఆందోళనకరంగా ఉంది. ఈ సమస్య గురించి సోషల్ మీడియా వేదికగా పోరాటం ఉధృతం చేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు వేలూరు రాకేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటన ద్వారా వివరాలను వెల్లడించారు. విత్తన కాలంలోనే యూరియా అందుబాటులో లేకపోవడం, కూలీలకు పనులు లేక ఆగిపోవడం, పంటలు ఆలస్యమవడం లాంటి పరిస్థితుల వలన ప్రత్యక్షంగా రైతు కుటుంబాలపై భారాన్ని మోపుతున్నాయన్నారు. ఈ సమస్య కేవలం ఒక సరఫరా లోపం కాదు, ఇది వ్యవసాయ విధానాలపై ఉన్న ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళికల లోటు, అధికార వ్యవస్థలో సమన్వయం లేమిని బట్టబయలు చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం విత్తన కాలంలో ఎరువుల అవసరం ఉంటుందని తెలిసి కూడా, ఈసారి రైతులకు అవసరమైన యూరియా సరఫరాను ముందుగా సురక్షిత పరచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. అన్నదాతల హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని సెప్టెంబర్ 9న తేదీన జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద శాంతియుతంగా నిరసన తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ యువత, సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రత్యేకంగా పిలుపునిస్తూ యూరియా సంక్షోభంపై నిజమైన సమాచారం, రైతుల వాస్తవ పరిస్థితులను దేశం మొత్తం చూడగలిగేలా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని బలపరచాల్సిందిగా ఆయన ఈసందర్భంగా పిలుపునిచ్చారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బ్యాంకు ప్రారంభించి 120 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం ఖాతాదారులతో కలిసి బ్యాంకు అధికారులు 121వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బ్యాంకు మేనేజర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ గత 120 సంవత్సరాలుగా బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాదారులకు ఎనలేని సేవలు అందించిందన్నారు. ఈ విజయానికి కారణమైన ఖాతాదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు సిబ్బంది లీనా, మౌనిక, ఉమ, శ్రీనివాసులు, మోహన్, విజయ్, నాగ, వినోద్, సతీష్, హేమకుమార్, ఖాతాదారులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న బ్యాంకు అధికారులు

8 నుంచి ఆధార్ కేంద్రాలు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజనులకు ఆధార్ నమోదు కేంద్రాలను నేటి నుంచి 13వ తేదీ వరకు ఏర్పాటుచేయనున్నట్లు శ్రీకాళహస్తి ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8న మేలచ్చూరు పంచాయతీ భవనం, 9న ఎంపేడు పంచాయతీ భవనం, 10న వేలవేడు సచివాలయం, 11న ముచ్చివోలు సచివాలయం, 12న ఎగవవీధి సచివాలయం, 13న వేడాం సచివాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డులేని గిరిజనులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ లేనివారు కొత్త ఆధార్ కార్డుకు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు లేని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుడిమల్లం ఆలయం మూసివేత



మూసివేసిన పరశురామేశ్వరాలయం

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిన ప్రఖ్యాత శైవ క్షేత్రం శ్రీఆనందవల్లీ సమేత పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం కారణంగా మూసివేశారు. ఆలయ ప్రధాన ద్వారాలు పూర్తిగా మూసివేయడంతో పాటు ముఖద్వారాలన్నీ మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని మళ్లీ తెరిచి భక్తులకు దర్శన ఏర్పాట్లు యథావిధిగా కొనసాగిస్తామని ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి తెలిపారు.

పల్లికొండేశ్వర ఆలయం..



మూసివేసిన పల్లికొండేశ్వరస్వామి ఆలయం

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆలయాన్ని మూసివేశామని ఆలయ కార్యనిర్వహణ అధికారి లత తెలిపారు. మళ్లీ సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి యథావిదిగా ఆలయంలో అభిషేకం అనంతరం భక్తులకు సర్వ దర్శనం ఏర్పాటు చేస్తామని ఈసందర్భంగా ఆలయ ఈఓ తెలిపారు.

అన్నదాత పోరును జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్, నేతలు

- పోస్టర్లు ఆవిష్కరించిన సమన్వయకర్త నూకతోటి రాజేష్

కేవీబీపురం: రైతులను చిన్నచూపు చూస్తున్న కూటమి ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ ఈనెల 9న జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సత్యవేడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కేవీబీపురం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ రైతు సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులకు సమయానికి ఎరువులను కూడా ఇవ్వకుండా వేధిస్తోందని అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించే విధంగా కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన పోరాటం చేసేందుకే రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట పడుతోందని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందించే విధంగా అందరూ సమష్టిగా పోరాడేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బొర్రా మాధవిరెడ్డి, సర్పంచులు రామ్మోహన్ వర్మ, రాజేష్, సీతముని, గిరిబాబు, నేతలు లాల్‌బాబు యాదవ్, మూర్తి, ఢిల్లీబాబు, బాలసుబ్రమణ్యం, దేవళ్లమణి, గాలి దయాకర్‌నాయుడు, కాటముని పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నాగలాపురం: పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్, తిరుపతి వెంకటేశ్వర అరవింద నేత్రాలయా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని స్థానిక సాయిబాబా మందిరంలో ఆదివారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 75 మందికి మందులు, 43 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. 80 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీ శంకర్, సీఈఓ సీతారామనాయుడు, ట్రస్ట్ ఏఓ కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్, సాయిబాబా ఆలయ ప్రతినిధులు జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులతో పెట్టుకుంటే మనుగడ ఉండదు

- వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికార ప్రతినిధి చిన్నా



వరదయ్యపాళెం: విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించిన దాఖలాలు చరిత్రలో లేవన్న వాస్తవాన్ని కూటమి ప్రభుత్వం గుర్తెరగాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికార ప్రతినిధి చిన్నా మండిపడ్డారు. ఆదివారం వరదయ్యపాళెంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని తెలిపారు. అపార అనుభవం ఉందని చెప్పుకునే సీఎం చంద్రబాబు తన 15ఏళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేస్తోందని ఆయన తీవ్రంగా దయ్యబట్టారు. కమీషన్ల కోసమే 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేసేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి ఆరోగ్య భద్రత కల్పించాలని, పేదలకు వైద్యం చేరువ చేయాలని ఉన్నత లక్ష్యంతో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మించి అనుమతులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే అక్కసుతోనే కూటమి సర్కారు కుట్రతో మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



బాధితుని పరామర్శిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని టీటీఈ కంపెనీ సీఎస్ఓ సూర్యరెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, యానాది సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటయ్య డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీటీఈలో సెక్యూరిటీగా పనిచేస్తున్న భాగ్యానాయక్‌ను ఆదివారం వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యనాయక్ సెక్యూరిటీగా ఈకంపెనీలో పనిచేస్తున్నాడన్నారు. రెండు రోజుల క్రితం సూర్యరెడ్డి భాగ్యనాయక్‌ను లాఠీతో కొట్టిగాయపరిచి, కులం పేరుతో దూషించారని చెప్పారు. రెండు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఏర్పేడు పోలీస్ అధికారులు కనీసం సూర్యరెడ్డిపై కేసు నమోదు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. కేసు నమోదు చేయకుంటే రేపటి నుంచి దళిత, యానాది సంఘాల ఆధ్వర్యంలో అట్రాసిటీ కేసు నమోదు చేసే వరకు ఆందోళనలు సాగిస్తామని అన్నారు. పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, ప్రజాసంఘాల నేతలు తమీన్, రాఘవులు, శేఖర్, చాన్‌బాషా పాల్గొన్నారు.

బాబును నమ్మి మోసపోయాం

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీలో ప్రజలు



బత్తినయ్య కాలనీలో ప్రచారం చేస్తున్న నేతలు

ఏర్పేడు: చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి ఓట్లేసి గెలిపించి మరోసారి మోసపోయామని ప్రజలు వాపోయారు. ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామ పంచాయతీ బత్తినయ్య కాలనీలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ రీకాల్ చంద్రబాబు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కూటమి చేస్తున్న మోసాలు, ఎగ్గొట్టిన హామీలను గురించి వివరించారు. వారికి ఏయే పథకాలు రాలేదో, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎంత నష్టపోయారో గణాంకాలతో వివరించారు. వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో ఎన్నికల మ్యానిఫెస్టోను ఎంతో పవిత్రంగా భావించి, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం పేదలు చాలా అవస్థలు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ టి.జనార్దన్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, తాళ్లపాక నాగార్జునరెడ్డి, సర్పంచులు మోహనప్రియ, నిర్మల, మండల ఉపాధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, మునిరత్నం రెడ్డి, బత్తయ్యయాదవ్, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గురునాథంగురువారెడ్డి, వెంకటేష్‌యాదవ్, మహేష్, నాగూర్‌రెడ్డి, సుబ్బమ్మ, జయశ్రీ పాల్గొన్నారు.